
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!!

# గురుకృప

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!

**ఓ సద్గురూ! నా హృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!**



## సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!!



ప్రజలందరి నోట సాయి నామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ధ నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
-- అదే నాఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

--- శ్రీ బాబూజీ

---

### *ఈ సంచికలో*


| | |
|---|---|
| 1. సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!! | శ్రీ బాబూజీ |
| 2. ఉన్నమాట - అనుకున్నమాట | గురుబంధువులు |
| 3. మరువకు ఎప్పుడూ గురుదేవులొక్కరే | కె. గవరరాజు |
| 4. యోచిస్తే గురుబోధలేనిదెక్కడ | సాయి శ్రీహర్ష |
| 5. బిడ్డకావాలా! తండ్రికావాలా! | సంధ్యారాణి |
| 6. గురూజీ ప్రసాదించిన గ్రేస్ మార్క్స్ | సి.కె.వాసంతి |
| 7. వంశానికి ఉద్ధారకుడు | రమేష్ |
| 8. అశ్రునయనాల నివాళి | |
| సత్సంగ మహిమ | పి. శివశంకర్ |
| మహాత్ముల రాక కోసం ప్రకృతి ఎదురుచూపులు | పి. శివశంకర్ |
| ప్రచండ ప్రకృతి సైతం మహాత్ముని అనుజ్ఞకోసం ... | పి. శివశంకర్ |
| సద్గురు శిక్షణావధానం ... చెప్పకుండానే అన్నీ నేర్పుతూ ... | పి. శివశంకర్ |
| 9. కృషి రవ్వంత - కృప కొండంత | ఐ.రామకృష్ణ |
| 10. ఏంటి డాడీ! గురువుగారికి తెలియదా? | జి. రత్తయ్య |
| 11. గోల్ చేయించినది గురువే... | వినయ్ |
| 12. ఆచేయి ఎంత హాయి | డా॥ ఎస్. సాయివరప్రసాదరావు |
| 13. మహనీయుల - మహితోక్తులు | గురుచరణదాసుడు |

# ఆత్మీయ గురుబంధువుకు అశృతర్పణ

మమత - మనసు - మంచితనం మూర్తీభవించిన మానవ తత్త్వం ఆయన సహజగుణం. ఆదరణ, ఆప్యాయత, అనురాగం, ఆత్మీయత ఆయన సొత్తు. పండగ వచ్చిందంటే వేలాది మందికి లేదనేది లేకుండా అందరికీ సాయినాథుని ప్రసాదం చేతికి అందించి ఆతిథ్యమివ్వడమంటే ఆయనకెంతో ఇష్టం. ఆహ్వానించి, ఆతిథ్యమివ్వడమే ఆయనకు ఆస్తి, వరం.

షిరిడీకొచ్చి సాయియానాలో భోజనం చేసిన పిన్నల నుండి పెద్దల వరకు 'భోజనం చేసారా?' అన్న పలకరింపుని, ఆయన రూపాన్ని, ఆయన సామరస్యాన్ని మర్చిపోలేరంటే అతిశయోక్తి కాదు. అలాంటివారు అరుదుగా లభిస్తారు.

ప్రపంచంలో కోటీశ్వరులెందరులేరు? ఇలా అన్నార్తులకు ముఖ్యంగా సాయినాథుని దర్శించడానికి షిరిడీకి వచ్చినవారికి భోజనం పెట్టి పేరుపేరున పలుకరించేవారు. ఇలాంటివారు కోటికొక్కరు.


'గురుకృప' ఒసంగిన సంపదను సద్వినియోగపరుచుకొని సాయినాథుని సేవకై సాయిసన్నిధికి తరలి వెళ్ళిన మన ఆత్మీయ గురుబంధువు శ్రీ శివశంకర్ గారికి మనందరి తరపున 'గురుకృప' ఆశృతర్పణమిస్తుంది. ఈ సంచికను 'శ్రీ శివశంకర్' గారి స్మృత్యర్థంగా అంకితమిస్తున్నది. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా సజీవంగా అందరి హృదయాలలో ఉన్నారు. అదే సాయినాథుని అనుగ్రహం. వారి కుటుంబానికి మనఃశాంతిని, ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించమని 'గురుకృప' ద్వారా మనందరం సాయినాథుని మనసారా ప్రార్థించుదాము.

## ఉన్నమాట-అనుకున్నమాట

'తద్విజ్ఞానార్థం గురువేవాభిగచ్ఛేత్' అని ఉపనిషద్వాణి. గురుసన్నిధికి చేరనిదే జ్ఞానసముపార్జనము పొందలేరు. గురువు యొక్క ఆవశ్యకత తెలియనివారు తరుచుగా మీ గురువు ఈయనకంటే గొప్పా! ఆయనకంటే గొప్పా! అని తమకున్న తక్కువతనాన్ని అవివేకంతో, అజ్ఞానంతో పలుకుతుంటారు. అనాలోచనంగా అంటుంటారు. ఈ లోకానికి గురువులెందుకు వస్తారో! నిజమైన గురువులేంచేస్తుంటారో! తెలియజేయవలసిన అవసరం, తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. తనను ఆశ్రయించుకొనిన శిష్యునికి గురువే తన మాటలద్వారా, చేతలద్వారా, బోధనల ద్వారా, శిక్షణ ద్వారా, మరెన్నో విధాల ఔదార్యం, విశాలహృదయం, క్రమశిక్షణ, దానగుణము, దయాగుణము, ధర్మగుణము, వీరగుణము, శాంతము, దాంతము, ఇత్యాతులెన్నో అష్టాదశపురాణాల రాశిలో వ్రాయుటకు కూడా అలవికానిది. గురుని చేరిననాటి నుండి శిష్యుని సమస్తవిషయాలు శిష్యునికి తెలియకుండానే గురువే నిర్వహణ సాగిస్తారను విషయము చాలామందికి తెలియదు. అలాంటి వారినే 'సచ్చితానంద సమర్థ సద్గురు' వని అంటాము. అందుకనే గురుతత్త్వము, గురువు యొక్క అవసరము తెలిసిన శంకర భగవత్పాదులవారు 'దృష్టాంతోనైవ దృష్టః త్రిభువన జఠరే సద్గురోః జ్ఞాన దాతు' జ్ఞానమునందించు సద్గురువుకు త్రిలోకములలోను

సాటియైనది మరొకటి లేదనినారు. కేవలము జ్ఞానమును మాత్రమే ఇవ్వటములోను సాటియైనది మరొకటి లేదనినారు. కేవలము జ్ఞానమును మాత్రమే ఇవ్వటముతో గురుని అవసరము తీరిపోవుటలేదు. జ్ఞానసముపార్జన విషయంలో తలెత్తు శిష్యుని యొక్క మనస్సునందలి మాలిన్యాదులు, మలవిక్షేపణాలు, ఆవరణ దోషాలను తుత్తినయలు చేసి చివరకు గమ్యాన్ని చేరుస్తారు. అలాంటివారినే సచ్చితానంద సమర్థసద్గురువని అంటాము. జ్ఞాన సముపార్జనలో అజ్ఞానమన్నది తలెత్తటమేమిటనే శంకను లేవదీస్తారు, వారి కుహనా పాండిత్య ప్రభావముతో వీరికి గురువంటే ఏమిటో తెలియదు కాబట్టి, ఏ గురువును సేవించలేడు కాబట్టి, వారి ఆరాధనలో గురువు ఉండడు కాబట్టి.

రైతు మాగాణి భూమిని సాగుచేసి సారవంతము చేసి వరినాట్లు నాటిన కొలది కాలములోనే కలుపు మొక్కలు ఎవరి ప్రమేయం లేకుండా మొలకెత్తుతాయి. ఎవరు ఆహ్వానించకుండానే చీడపురుగులు ఆశ్రయించుతాయి. పంటదిగుబడి తగ్గించే ఎన్నో విఘాతాలు ఏర్పడతాయి. సస్యరక్షణాధికారుల సలహా మేరకు వాటిని నివారణ గావించుతాడు రైతు. ఇదే మాదిరిగా జ్ఞాన సముపార్జనలో తలెత్తే వివిధ సంశయాలను (కలుపు మొక్కల వంటివి) గురువు చాకచక్యంగా తొలగించుతారు. ఒక్క పర్యాయం 'తద్విద్ధి ప్రణిపాతేన...' అన్న గీతా శ్లోకానికి బాబా చెప్పిన మాటలు ఈ సమయంలో గుర్తుకు రావాలి.




కొందరు కుతార్కికులు బాబా ఉందగా ఇతర గురువులెందుకంటారు. తమ వాదనాపటిమతో 'సూర్యుడిని చూపడానికి దివిటీలు కావాలా?' అంటారు. సాధారణ కోర్కెలతో సతమతమవువానికి ఆ కుతర్కం నచ్చుతుందేమోగానీ! అసాధరణ వ్యక్తులముందా తార్కికం నిలవదు. అర్జునునికి విలువిద్య నేర్పే ప్రయత్నంలో ద్రోణాచార్యులవారు చెట్టుమీద పక్షిని ఉంచి, తాను లక్ష్యాన్ని మాత్రమే చూస్తున్నాడని గ్రహించిన తరువాతే బాణాన్ని వదలమన్నారు. ఆధ్యాత్మికమార్గంలో 'బాబా' యే లక్ష్యమై వుంటే లక్ష్యం మీదనే కాదు చూపు. లక్ష్యాన్ని చేరుకునే బాణము చివరగల ములికిని కూడా గమనిస్తూ, తన ములికి లక్ష్యం మీద ఉన్నదా? లేదా? అని గమనించాలి. ఇక్కడ ధనస్సు, బాణము, ములికి సమస్తము గురువే. గురువు చెప్పిన రీతిలో త్వరితమార్గాన లక్ష్యాన్ని చేరుకుంటాడు. ములికిపై చూపెంత అవసరమో? గురువు కూడా ఇక్కడ అంతే సాధకుడు ఎప్పుడైతే లక్ష్యాన్ని ఛేధిస్తాడో గురుసమానుడైనట్లుగానే, ఆధ్యాత్మిక సాధనలో ఆ గురువే సమస్తమైపోతాడు. ప్రారంభంలో రెండుగా కనిపించిననూ చివరిలో రెండు ఒకటిగానే అయిపోతాయి. అపుడు బాబాను చేర్చుటకు సహకరించిన వ్యక్తియే బాబాగా మారిపోతాడు. స్కూల్లో చదువుకొని, తర్ఫీదయిన తరువాత అనుభవాన్ని సంపాదించి, ఆ తరువాత ఆ స్కూల్లో తాను ఉపాధ్యాయుడైనట్లుగానే, మట్టిబొమ్మ నైనా ముందుంచుకొని గురువుగా ద్రోణాచార్యుని భావించినందునే ఏకలవ్యునికి శాస్త్ర విద్య అబ్బినది. గురువు యొక్క అవసరమెంత ఉందో అందరూ గుర్తించాలి. సజీవుడైన, సమర్థుడైన విలువిద్యా నిపుణుడైన ద్రోణాచార్యులు అర్జునునికి లభించినందు వల్లనే ముల్లోకములందు తిరుగులేని మేటిగా రాణించాడు. సరి అయిన గురువు లభించనందు వల్లనే కొందరు రాణించలేక పోవుచున్నారు. ఇప్పుడైన గురువు యొక్క అవసరాన్ని తెలుసుకొని శరద్‌బాబూజీ వంటి వారి పాదపద్మములను ఆశ్రయించుదాం

*"ఆత్మజ్ఞానానికి పూర్ణుడైన సద్గురు అనుగ్రహం అవసరం"*

## మరువకు ఎప్పుడూ గురుదేవులొక్కరే పరమబంధువుడగునే మనసా

పూజ్యగురుదేవుల పాదపద్మములకు నమస్కారములతో గురుదేవులు ప్రసాదించిన 'లీల' అనే అమృతం నా జీవితంలో ఎలా వెలుగు నింపిందనే విషయాన్ని తెలియజేస్తున్నాను. గడచిన విజయదశమికి నేను, నా భార్య షిరిడీలో గురుదేవుల్ని దర్శించుకున్నాం. నా భార్య ఉద్యోగికావడంతో, తనను షిరిడి నుండి ముందుగా పంపి, నేను మరోవారం రోజులు షిరిడీలో గడిపాను.

గురుదేవుల్ని అందరి కంటే చివరిగా దర్శించుకొని, ఎక్కువ సమయం వారి సన్నిధిలో గడపాలని, మాట్లాడే విధానం రాకపోయినా ఎన్నో విషయాలు వారికి తెలియజేసుకోవాలని నా కుతూహలం. ఇలా తృప్తినిచ్చే విధంగా గురుదేవుల దర్శనం జరగాలని 'బాబా'కు విన్నవించుకున్నాను. ఇదే విధంగా ఈ 'విజయదశమి' దర్శనం కూడా జరిగింది. సరే ఎప్పుడూ గురువు గారికి విన్నవించే లిస్ట్ ఉండనే ఉంది. నా సంస్కారాన్ని అనుసరించి నాకు అదికావాలి, ఇదికావాలి అని తెలియజేసాను. గురుదేవులకు అన్ని విషయాలు చెప్పాను. ఆయన ఓర్పుగా విని ఆశీస్సులందజేసారు. గురుదేవులు తమ అనుగ్రహంతో మనల్ని ప్రతిక్షణం కాపాడతారనే విషయం ఆలస్యంగా తెలుసుకున్నాను. గురుదేవులకు పాదనమస్కారం చేసుకొని, బయటకు వచ్చి గురువుగారి ఫోటోకు నమస్కారం చేసుకొని బయలుదేరాను.



ఇంతలో డా॥నరేంద్రగారు (వచ్చి) నన్ను ఆత్రుతగా వెదుకుతూ గురుదేవులు నన్ను మెడికల్ చెకప్ చేయించుకోమని చెప్పారని తెలియజేసారు. చెకప్ అయిన తరువాత రిపోర్ట్స్ పంపమని తెలిపారు. తండ్రి బిడ్డ యొక్క యోగక్షేమాలు తెలుసుకునే తీరు ఇదేకదా! సహ గురుబంధువులైన డా॥ బి.ఎస్.రెడ్డి గారు, శివగారు వచ్చి ప్రేమగా ఏమైందని పలకరించారు.


గురుదేవులే నన్ను చెకప్ చేయించుకోమన్నారంటే నాకు ఎంత పెద్ద జబ్బు అయి ఉండాలి! ఎంతటి పెద్ద జబ్బు అయినా వారి అనుగ్రహం కాపాడుతుందనే విశ్వాసం నాకుంది. నాలాగా ఎటువంటి అర్హత లేని వ్యక్తిని కంటికి రెప్పలా కాపాడుతున్నారనే అంశం అవగతమయ్యి ఉప్పొంగిపోయాను.

బాబా, గురువుగారికి నమస్కరించి కందుకూరు వెళ్ళి నాభార్యకు జరిగిన విషయం చెప్పి మన మీద గురువుగారి అనుగ్రహం అనే రక్షణ ఉందని ధైర్యం చెప్పాను. ఇంతకాలం నా హెల్త్ గురించి నాకు ఎంతో నమ్మకం ఉండేది. చెకప్ చేసే ల్యాబ్ కు వెళ్ళి గురుదేవులకు పంపవలసిన రిపోర్ట్స్ అని, చాలా జాగ్రత్తగా ప్రిపేర్ చేయాలని తెలిపాను. రెండు గంటల తరువాత రిపోర్ట్స్ తీసుకున్నాను. అప్పుడు బయట పడింది నా ఆరోగ్యం అసలు స్వరూపం. యూరిన్ లో, బ్లడ్ లో షుగర్, ఎన్నో ఇన్ఫెక్షన్స్. వెంటనే షిరిడీకి ఫోన్ చేసి (గురుదేవులకు విషయం తెలుపుటకోసం) నరేంద్రగారికి విషయం తెలియజేసాను.

రేపు మరల ఫాస్టింగ్ (ఏమీ తినకుండా) ఉండి, టెస్ట్ రిజల్టు పంపమని చెప్పారు నరేంద్ర గారు. వేరే ల్యాబ్‌లో మరల అన్నీ టెస్టులు చేయించాను. మధ్యాహ్నం రిపోర్ట్సు తీసుకొని చూస్తే అన్ని రిపోర్ట్సు లోను నిల్ రిజల్టు వచ్చాయి. మరల ఫోన్ చేసి నరేంద్రగార్కి తెలిపాను, గురుదేవులకు చెపుతానన్నారు. ఇంకోసారి, ఏదైనా ఆధునిక పరికరాలున్న చోట చెకప్ చేయించి రిపోర్ట్సు పంపమన్నారు.

విశాఖలో, విజయ మెడికల్ సెంటర్‌లో మరల చెకప్ చేయించగా అక్కడ కూడా నిల్ రిజల్టు వచ్చింది. మూడూ రిపోర్ట్సు షిర్డికి పంపాను. నరేంద్రగాను, గురుదేవులకు చెబుతానను ధైర్యం చెప్పారు. నాచుట్టూ ఉంటున్న బంధువులు, గురుబంధువులు నిత్యం నాతో ఉండే నా భార్య వీరెవ్వరూ, నేను గమనించని నా అనారోగ్యం గురుదేవులు గుర్తించి, వారి ఆశీస్సులతో తగ్గించారు. ఇలా ప్రతీక్షణం వెన్నంటి కాపాడే 'కదలాడూ దైవమే' మనకు 'సద్గురువు' అవ్వడం మన అదృష్టం. ఈ అనుభవం ప్రచారమో, ఒక పొగడ్తల పేజీనో కాదు. కేవలం వారి అనుగ్రహం మీదే ఆధారపడి స్వాంతన పొందిన ఒక సామా న్యుని వాస్తవస్థితి.

ఈ మధ్య మరల కొంచెం అనారోగ్యంగా ఉంటే తిరిగి టెస్టులు చేయించగా, మరల నిల్ రిజల్టు వచ్చాయి. ఈ టెస్టుకు ముందు గురుదేవులు స్వప్న దర్శనమిచ్చారు. డాక్టరు నేను ఎక్సర్‌సైజులు, వాకింగ్ చేస్తే చాలు హెల్త్ చక్కబడుతుందని చెప్పారు.



మా ఫాదరుకు షుగర్ వున్నది. వంశ పారంపర్యంగా వెన్నంటి వుండే ఈ జబ్బుని వెన్నంటి ఉండే గురూజీ ఒక్క రోజులో పారద్రోలిన విధం నాజీవితమనే పుస్తకంలో ఒక బంగారు పేజీగా మిగిలిపోతుంది. ఇట్టి సద్గురువును ప్రసాదించిన 'బాబా'కు నమస్సులు తెలియజేసుకుంటూ, నన్ను వెన్నంటి క్షణక్షణం నా శ్రేయస్సును చూసుకుంటున్న గురుదేవులకు పాదాభివందనం చేసుకుంటూ...

కె. గవరరాజు, భీముని పట్టణం.

*భక్తులకు ఐహికంగానూ, ఆముష్మికంగానూ లాభం చేకూర్చడానికే మహాత్ములున్నది. ' అనేవారు బాబా.*
*సాయిభక్తిసాధన రహస్యం. పు. 13*

## యోచిస్తే 'గురుబోధ' లేనిదెక్కడ

ప్రియ గురు బంధువులకు,

నాకు గురుదేవులు అనుగ్రహించిన ఒక వ్యక్తిగత అనుభవాన్ని మీతో పంచుకునే ప్రయత్నం చేస్తాను. చూసేందుకు చాలా సాధారణమైన లీలగా తోచినా, అందులోని అంతరార్థం గ్రహించిన నాకు చాలా ఆనందమనిపించింది.

నేను పదవ తరగతి చెదివేటప్పుడు ట్యూషన్ చదువుతున్న రోజుల్లో మేము రాత్రి 8గం॥ల దాకా చదివి తర్వాత ఆటలాడుకునే వాళ్ళం. ఒకరోజున మా ఆటలో భాగంగా 'దోమల్ని చంపడం' ఒక ఆటగా పెట్టుకున్నాం. ఆ 'చంపడం' అనే ఆటలో ఆరోజు నేనే విజేతని. ఈ ఆటని మేము తర్వాత రోజుకూడా కొనసాగించాం. దీన్ని ఒక అద్భుతమైన పనిగా భావించాం. ఆ తర్వాత రోజు నాకు ఒక కల వచ్చింది. కలలో నేను ద్వారకామాయిని చూసాను. ద్వారకామాయి ముంగిట్లో నేను ఒక గ్రద్దను చూసాను. నేను లోనికి వెళ్ళేసరికి ఒక పులి లోపల ఉంది. బాబా స్థానంలో గురువుగారు కూర్చున్నారు. ఆ పులి గురువుగారి ముందు సాష్టాంగ పడడం చూసాను. 'పులి' గురువుగారికి నమస్కారం చేయడం నాకు సహజమనిపించింది. కానీ గురువుగారు తిరిగి పులికి నమస్కరించడం చూసి నాకు వింతగా తోచింది.

మేల్కొన్న తరువాత ఆలోచిస్తే నేను చూసిన దృశ్యం యొక్క అంతరార్థాన్ని అవగతం చేసుకోలేకపోయాను. సాయిసచ్చరిత్ర 9వ అధ్యాయం, సత్సంగం ద్వారా నాకు 'గురువుగారు ప్రతి ప్రాణి పట్ల కరుణ కలిగి ఉంటారని' అర్థం చేసుకున్నాను. ఈ విషయం అవగతమైన తర్వాత నేను దోమల్ని చంపడం అనే క్రీడను వదిలిపెట్టాను.

'గురూజీ' హైదరాబాద్ వచ్చిన రోజున నేను ఒక పెన్ తీసుకు వెళ్ళి గురూజీ కరస్పర్శతో పునీతం చేయించుకోవాలని భావించాను. కానీ ఆరోజున వున్న రద్దీలో దర్శన భాగ్యమే కష్టమనిపించింది. గురుబంధువులంతా దర్శనభాగ్యం కోసం తపించిపోతున్నారు. నేనూ అందరిలో ఒకడిని. నేను పెన్ తెచ్చానని గుర్తుకురావడంతో నా జేబులోంచి పెన్‌తీసి చేత్తోపట్టుకున్నాను. గురువుగారు వేదిక మీద నుంచి క్రిందికి దిగుతూ ఉన్నట్లుండి నావైపుతిరిగి ముందుగా నాపెన్ తాకి తర్వాత సహగురుబంధువుల కోర్కెలు తీర్చారు.

ఊహించని సంఘటనతో నా ఆనందానికి అవధుల్లేవు. మా నాన్నగారికి కూడా ఈ సమయంలో మూడు సార్లు పాదదర్శనం చేసుకునే భాగ్యం లభించింది. మనం అడిగిన తీరులో మనల్ని గురువుగారు అనుగ్రహిస్తారనే విషయం అర్థం చేసుకున్నాను. ఆ అడిగే తీరును మనం నేర్చుకొనేందుకే సాయిపథంలో మనం సాగాలని గురువుగారు తెలియజెపుతూ, ఆ అడగడం నేర్పుటే బాబాపథం అని తెలియజేసారు.
సద్గురు అనుగ్రహం ఎల్లరపై ఉండుగాక.

ఎన్. సాయిశ్రీహర్ష, విజయవాడ.

## బిడ్డ కావాలా! తండ్రి కావాలా!

జూన్ 27న నాకు జరిగిన ఒక అద్భుత అనుభవాన్ని గురుబంధువులందరితో పంచుకోవాలన్న కోరికతో రాస్తున్నాను.

జూలై 5న గురుపౌర్ణమి నాటికి బంధువులు షిరిడీలో ఉండాలని, ముందుగానే అనగా జూన్ 28నాటికి సాయియానా బస్సులో టికెట్ బుక్ చేసుకున్నాను. గురువుగారి దయవల్ల, బాబా కృపవల్ల షిరిడీ వెళ్ళడమంటే నాకు పుట్టింటికెళ్ళేంత ఆనందం కలుగుతుంది. ఆ ఆనందంలో నేనుండగా 26వ తారీఖు మధ్యాహ్నం 3 గంటలకు

ఢిల్లీలో ఉన్న నా పెద్ద కూతురు ఫోన్ చేసి 'అమ్మా నాకు పెద్ద ప్రాబ్లం వచ్చింది. నేను తట్టుకోలేక పోతున్నాను. నువ్వు వెంటనే బయలుదేరిరా అన్నది. ఫోనులోనే ఏడవడం మొదలు పెట్టింది. మళ్ళీ రాత్రికి ఫోన్ చేస్తాను, నువ్వు టికెట్ బుక్ చేసుకో అన్నది. అమ్మాయికి ఫోన్‌లోనే ధైర్యం చెప్పాను. ఇంకొక్క రోజు చూడు తప్పనిసరి అయితే బయలుదేరుతాను అని అన్నాను.

అలా అన్నానేగానీ, షిరిడీ ప్రయాణం రద్దవుతుందన్న ఊహ నేను భరించ లేకపోయాను. బిడ్డకావాలా? తండ్రికావాలా? అన్న ప్రశ్నకి జవాబు నా మనసు చెప్పలేకపోయింది. సాయంత్రం రోజులాగానే బాబా దగ్గర దీపం పెట్టి ఇలా అనుకున్నాను. బాబా! తల్లి, తండ్రి, గురువు, దైవం సర్వం నీవే అనుకున్నాను. నా జీవితంలో నేను తిన్నదెబ్బలకి, నీ అండలేకపోతే నేను తట్టుకోగలిగేదాన్ని కాదు. మంచిగానీ, చెడుగానీ ఏదిజరిగినా నీ ప్రసాదంగా భావించాను. ఇంత గుడ్డిగా నిను నమ్ముకున్న నన్ను ఇంకా ఎందుకు పరీక్షిస్తావు. ఇపుడు నీదగ్గరకు రావడం కోసం బిడ్డను వదులుకుంటానా? బిడ్డదగ్గరకు వెళ్ళడానికి నిన్ను వదులుకుంటానా? అని నాకు పరీక్షపెట్టావనే నమ్ముతున్నాను. ఇదే నీ నిర్ణయమయితే నీ బిడ్డనయిన నా నిర్ణయం కూడా విను, ఈ రోజు రాత్రి 12 గం॥ లోపు నా బిడ్డ 'అమ్మా నా ప్రాబ్లం సాల్వ్ అయింది' అని చెప్పిందా సరే, లేకపోతే మళ్ళీ జన్మలో షిరిడీ రాను, నీనామం చెప్పను, 12 గంటలవరకు నీ ఎదురుగా ఇలాగే కూర్చుంటాను. ఇక్కడ నుండి కదలను అని అలాగే కూర్చున్నాను. మరిఇది తప్పో కాదో నాకు తెలియదు. భరించలేని టెన్షన్‌లో అలా అనుకున్నాను. ఆ తరువాత నిర్ణయం బాబాకే వదిలి ఏ ఆలోచనా పెట్టుకోకుండా బాబా ఫోటోవైపే చూస్తూ కూర్చున్నాను.

గడియారం 11 గం॥ కొట్టింది. ఫోన్ ఏదీ రాలేదు. అప్పటివరకూ బాబా తప్పకుండా దారి చూపిస్తారు అన్న నమ్మకంతో వున్న నా మనసులో అలజడి మొదలయింది. ఏమవుతుంది! నేను బాబా దయని కోల్పోయే స్థితి వచ్చిందా? ఏ దుష్టశక్తి నా చేత అలా మాట్లాడించింది అన్న భయం, ఏమీ చెయ్యలేని స్థితి. బాబాకి దూరమవుతున్నానన్న భయం. చాలా భయంకరమైన పరిస్థితిలో వున్న నేను టైమ్ చూసేసరికి 11:45 ని॥ అయింది.

ఇంక నాకు నిస్పృహ కలిగింది. సరిగ్గా 11:55 ని॥ లకు ఫోన్ మ్రోగింది. మా అమ్మాయి 'అమ్మా! బాబా దయవల్ల నా ప్రాబ్లం సాల్వ్ అయింది. నువ్వు వర్రీ కావద్దు' అని చెప్పింది. అంతవరకు వున్న నా టెన్షన్ ఒక్కసారి ఏడుపు రూపంలో బయటకు వచ్చింది. బాబా పాదాలమీద తలపెట్టి ఏడ్చేసాను.

అనుకున్న రోజుకి బాబా దయవల్ల షిరిడీ చేరుకున్నాను. ఈ అనుభవం వల్ల నాకు ఒక నిజం తెలియవచ్చింది. తననే నమ్ముకున్న బిడ్డలు తప్పుగా మాట్లాడినా, తెలియక తప్పు చేసినా, క్షమించి ఆదరిస్తారేగానీ వారిని దూరమవ్వనివ్వని కరుణామయుడు మన బాబా. కాబట్టి సర్వకాల సర్వావస్థలయందు ఆయన్నే నమ్ముకొని ఉంటాను.

శ్రీమతి జి. సంధ్యారాణి, హైదరాబాద్

*కోర్కెలను తీర్చుటలో లేదు నిదానము!*
*కోర్కెలను 'తీర్చి - తీర్చిదిద్దుట' యే శ్రీ సాయి విధానము ... బాబూజీ*

## గురూజీ ప్రసాదించిన గ్రేస్ మార్క్స్

నా పేరు వాసంతి, మాది విజయవాడ. నాకు గురువుగారు ప్రసాదించిన అనుభవం గురుబంధువులతో పంచుకోవాలని ఆశిస్తున్నాను.

నేను మొన్న మార్చి 2002లో ఎం.కాం ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ రాసాను. మాకు మొత్తం 6 పేపర్లు ఉంటాయి. మొన్న ఎగ్జామ్స్‌లో మాకు ఇన్‌కంటాక్స్ పేపర్ టఫ్‌గా ఇచ్చారు. నిజం చెప్పాలంటే సిలబస్ మారేసరికి మేము అన్ని చాప్టర్స్ ప్రిపేర్ అవ్వలేదు. అందువల్ల ఆ పేపర్ సరిగ్గా రాయలేదు. అన్నీ సమ్స్ , థీరీ అంతా 100 మార్కులకు అటెమ్ట్ అయితే చేసాను. కానీ పాస్ అవుతాను అనిపించలేదు.

నేను మే 2002 లో గురువుగారి దర్శనానికి షిరిడీ వచ్చాను. అప్పుడు గురువుగారితో చెప్పాను 'టాక్స్ పేపర్ సరిగ్గా రాయలేదు' మీరే పాస్ అయ్యేలా చూడాలని అంటే గురువుగారు నవ్వి తల వూపారు. నేను గురుపౌర్ణమికి మళ్ళీ షిర్డీ వెళ్ళాను. నేను షిరిడీలో ఉండగానే నాకు న్యూస్ వచ్చింది. ఎం.కాం రిజల్టు వచ్చాయని ఫస్ట్ క్లాసులో పాస్ అయ్యానని. నేను విజయవాడ వెళ్ళాక మార్క్స్ లిస్ట్ తీసుకున్నాను. ట్యాక్స్ పేపర్ లో 48 మార్కులు , నేను వూహించిన దానికంటే చాలా ఎక్కువ రావడంతో ఆశ్చర్యపోయాను.

ఇంత మంచి అనుభవం ప్రసాదించిన గురువుగారికి నా సాష్టాంగనమస్కారములు. వారి ఆశీస్సులు నాపై ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను.

సి.కె.వాసంతి, విజయవాడ.

## వంశానికి ఉద్ధారకుడు - ఆ వరాన్నిచ్చింది సద్గురువే


సద్గురు పాదములకు నమస్కరించి గురువుగారు నాకిచ్చిన ఈ అందమైన ఆనందమైన అనుభవాన్ని మీతో పంచుకుంటున్నందుకు మనస్ఫూర్తిగా సంతోషిస్తున్నాను. మొట్టమొదటసారిగా 13-12-97వ తేదీన షిర్డి వెళ్ళాము. ఎలా వెళ్ళాలో కూడా తెలియదు. తెనాలి రైల్వేస్టేషన్‌కు వెళ్ళాము. అక్కడ గురుబంధువులు మాకు కలిసి గురువుగారి దగ్గరకు, బాబాదగ్గరకు తీసుకొని వెళ్ళారు. వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. రెండవసారి మా ఆవిడ గర్భిణిగా వున్నపుడు బాబు పుడితే షిర్డీ వస్తామనుకున్నాము. అమ్మాయి పుట్టింది. అపుడు డాక్టరుగారిని ఆపరేషను చేయమంటే, ఇప్పుడు కాదు తరువాత చేస్తాను అన్నారు. ఇదంతా బాబా ఆశీస్సులవలనే జరిగింది. ఆతరువాత గురువుగారి దగ్గరకు వెళ్ళి ఇద్దరు ఆడపిల్లలు, బాబు కావాలని అడిగితే 'బాబా ఉన్నారయ్యా' అని అన్నారు. తరువాత 1998లో వెళ్ళినపుడు అడిగితే అదేమాట అన్నారు. తరువాత 1999లో గురుపౌర్ణమికి వెళ్ళినపుడు గురువుగారిని బాబు కావాలని అడిగితే 'ష్యూర్' అన్నారు. ఆతరువాత గర్భిణి వస్తే 15రోజులకు ఇంజక్షను చేయించుకోవాలి. నా భార్య మూడోనెల వచ్చాక చూపించుకొందామనుకొన్నది మూడు సార్లు వెళ్ళిచూపించుకోకుండా తిరిగి వచ్చింది. శ్రీరామనవమి పండుకకు అబార్షను అయింది. ఏమిటి, ఇలా జరిగింది అని బాధపడ్డాము. సత్సంగము దగ్గర పానకము, పులిహోర అందరికీ పంచుతుంటే అక్కడకు వెళ్ళి వచ్చాను. ఆ తరువాత అంతా

మనమంచికే ఇలా చేసారు గురువుగారు అని ఆనందపడ్డాము. తరువాత 2000 గురుపౌర్ణమికి వెళ్ళి ఉంచమంటారా ఆపరేషన్ చేయించమంటారా? అని అడిగితే గురువుగారు అలా ఉండని అని అన్నారు. 19వ తారీఖున 2001న 12:25 ని॥లకు బాబు పుట్టాడు. గురువుగారు ఆశీస్సుల వలన క్షేమంగానే ఉన్నాడు. జాతకము చూపించుకుంటే నా జాతకములో బాబు పుడతారని ఉంది. నా భార్య జాతకములో లేదు. గురువుగారు వారి పేగు చీల్చి మాకు బాబును ప్రసాదించారు. మా వంశానికి ఉద్ధారకుని ప్రసాదించారు.

మాపెళ్ళి రోజున నాభార్య గొలుసు పెట్టుకోమని బలవంతం చేస్తే పెట్టుకున్నాను. అది ఆ రోజే పోయింది. మా ఇంటి దగ్గర బాబా గుడికి వెళ్ళి నమస్కారము చేసుకొని, ఆ తరువాత ఆటోస్టాండ్ కు వెళ్ళి అక్కడి నుండి తెనాలి దత్తసాయి ఆలయానికి వెళ్ళాము. మేము అంతా వెతికాము. ఎక్కడా కనిపించలేదు. ఎంతో బాధ కలిగింది. దత్తసాయి ఆలయంలో కూడా అడిగాము. ఆ గుడి మేనేజరు చూసి వుంటే ఇస్తాము అన్నారు. తరువాత అది కొబ్బరికాయ కొనటానికి వెళితే అక్కడ పడిందట. మెడలో వేసుకున్న గొలుసు ఎక్కడా పడకుండా గురువుగారి కృపవలన గుడిలోనే పడినది. ఆయన రెండురోజుల తర్వాత ఇచ్చారు. ఇదంతా గురుకృపే.

రమేష్, అంగలకుదురు

*గ్రహబలం కూడా గురు అనుగ్రహఫలానికి లోకువే*



## అశ్రునయనాల నివాళి

ఇప్పటికి అందరికి తెలిసిన విషాద విషయం, శిరిడీలో మన అన్నదాత శ్రీ శివశంకర్ గారు ఇక మనకి కనిపించరు. అలా బాబా నిర్ణయంగా ది. 21-12-2002న బాబా తన చెంతకి రప్పించుకున్నారు.

ఆయన గురించి వ్రాయాలి అంటే ఈ సంచికలో పేజీలు మొత్తం చాలవు. అలా ప్రతి గురుబంధువుతో ఆయన కలిసిపోయేవారు. భోజనకార్యక్రమాల సమయంలో పేరు పేరునా 'మీరు భోజనము చేసారా? వెంటనే చెయ్యండి అబ్బా' అని ప్రతివారిని ఆప్యాయంగా పలకరించి తినిపించి తృప్తిపడతారు. వండిన ప్రదార్థాలు కూడా వేడివేడిగా వడ్డించాలి అంటారు. 'ముందే గిన్నెలలోకి తీస్తే చల్లారి పోతాయి.. మనము వండుకున్నది ఎందుకు? చల్లగా పెట్టడానికా? ' అని అంటారు. వంటవారు ఆయనకు తెలియకుండా ఏమైనా సర్దుబాటుగా వ్యవహరించినా, చనువుగా మందలిస్తూ 'అలాంటి పనులు చెయ్యకండి, గురువుగారికి ఇష్టం ఉండదు' అని వారితో చక్కగా తనకి నచ్చినట్లుగా ప్రతివంటా రుచిగా తయారు చేయిస్తారు. సరిపెట్టుకునే మనస్తత్వం కాదువారిది. అంతటి గొప్పవ్యక్తికి పుట్టిన బిడ్డ యింకా ఎంత గొప్పవాడో ఈ క్రింది మాటల వల్ల తెలుస్తోంది.

ది. 24-12-2002 సికింద్రాబాదులో వారి ఇంటికి వెళ్ళి వారి అబ్బాయిని, వారి అమ్మాయిని ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించగా వారి అబ్బాయి చి॥ పద్మనాభుని రెడ్డి కుమార్ నుండి వచ్చిన జవాబు వలన వారికి బాబాయెడల గల దృఢమైన విశ్వాసము ఎంతో విశదమైనది. 'అంకుల్ ఇలా జరిగినందుకు మేము బాధపడటం

లేదు. ఎందుకంటే నేను విన్న విషయం 'భగవంతుడి పూజకు పుష్పాలైన మనలను భగవంతుడు తనకు నచ్చిన పుష్పాలను ఏరి ముందుగా తనవద్దకు పిలిపించుకుంటారట కదా!' అలాగే నాన్నగారు బాబాకు ఇష్టమైన పువ్వుగా వెళ్ళారు అని చెప్పటం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. తరువాత బెంగుళూరు ప్రయాణానికి ముందురోజు శ్రీ శివశంకరుగారు స్వయంగా కంప్యూటరుపై తయారు చేసిన గురూజీ లీలలను రెడ్డికి చూపించి 'ఇవి బుక్లో ప్రింటు అవ్వాలి' అని ఎంతో ఆనందంగా చెప్పిన చివరి మాటలట. వాటిని మాకు ఇస్తూ ఇవి మీరు ప్రింటు చేస్తే నాన్నగారు ఎంతో సంతోషిస్తారు' అని అందించటం జరిగింది.

'గురుకృప'లో ఎలా వారిగురించి వ్రాసి, వారు చేసిన సేవకు కృతజ్ఞతలు తెలపాలా? అని అనుకుంటున్న మాకు ఇలా ఈ అనుభవాలు ప్రింట్ చేయడానికి అవకాశం లభించడం గురులీల కాదంటారా!

మన గురుబంధువులందరము ఈ గురుకృపద్వారా వారి కుటుంబ సభ్యులకు బాబా, గురూజీ ఆశీస్సులు లభించాలని కోరుకుందాము.

24-12-2002 'గురుకృప'


## సత్సంగ మహిమ

1998, జులై 20 నాడు ఒక పెద్ద కాంట్రాక్టు పనిలో టెండరు వేయాల్సి ఉండెను. ఈ పనిని ప్రపంచబ్యాంక్ అప్పుతో ప్రారంభిస్తున్నారు. దాదాపు 270 పేజీలు టైపు చేయించాల్సిన పని. శనివారం నాటికి టైప్ పని దాదాపు పూర్తయింది. చదివి ఫైనల్ చేయాల్సిఉంది. ఆదివారం నాడు శాస్త్రిగారింట్లో సత్సంగమని చెప్పారు. సత్సంగానికి వెళ్ళాలా? టెండర్ పని పూర్తి చేసుకోవాలా? అనే సమస్య వచ్చింది. ఏది ఏమయినా సత్సంగానికే వెళ్ళేదానికే నిర్ణయించుకున్నాను. టెండర్ పేపర్స్ చుడాల్సిన పని మరొకరికి అప్పజెప్పడానికి నా మిత్రుడయిన ఒక చార్టెర్డ్ అకౌంటెంట్ గారికి ఫోన్ చేసాను. అప్పుడు ఆయన ద్వారా టెండర్ మార్చాల్సివుందని తెలిసింది. శనివారం సాయంత్రమే కాంట్రాక్ట్ నిబంధనలలో మార్పులు చేస్తూ లెటర్ పంపారని చెప్పాడు. మా ఫాక్టరీ ఆఫీసుకు ఆ లెటర్ వచ్చినా, అదేదో మామూలు విషయమనుకొని ఎవ్వరూ పట్టించుకోలేదు. ఆ మారిన టర్మ్స్ ప్రకారం 270 పేజీలు మళ్ళీ టైపు చేయాల్సివచ్చింది. నేను సత్సంగానికి వెళ్ళడానికి నిర్ణయించి ఉండనట్లయితే మా మిత్రునికి ఫోన్ చేసేవాణ్ణి కాదు. ఆ సవరణ విషయం మాకు తెలిసేది కాదు. పాతటర్మ్స్ ప్రకారము టెండర్ పేపర్స్ పంపించి ఉండేవారము. కోట్లాది రూపాయల టెండర్ పరిశీలనలోనే ఉండేది కాదు.

## మహాత్ముల రాక కోసం ప్రకృతి ఎదురుచూపులు

1999 జనవరిలో గురువుగారితో పాటు తిరువణ్ణామలై వెళ్తున్నాము. శిరిడీనుండి పూనా, పూనా నుంది బెంగుళూరు, బెంగుళూరు నుండి తిరువణ్ణామలై వెళ్ళాలి. పూనా నుండి మధ్యాహ్నం 2 గంటలకు బెంగుళూరు వెళ్ళే ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్లో వెళ్ళాలి. పూనాలో ఒంటిగంటకు ప్రయాణికులు చెకింగ్‌కు రిపోర్ట్ చేయాలి. శిరిడీ

నుండి పూనాకు కారులో వెళ్ళినట్లయితే కనీసం నాలుగున్నర గంటలు పడుతుంది. అప్పటికే ఉదయం 9 గంటలు దాటింది. గురువుగారింకా బయలుదేరలేదు. టైమ్ సరిపోతుందా అని అనుకొన్నాము. చివరకు ఉదయం 9:30 గంటలకు గురువుగారు బయలుదేరారు. నేను,నారాయణరావుగారు, భానుమూర్తిగారు, ఇవాన్ గారు బయలుదేరాము. మార్గమధ్యములో పూనాకు ఫోన్ చేద్దామని ఆగాము. పూనాకు లైన్స్ దొరకలేదు ఐదునిముషాలు ప్రయత్నించాము. అంతలో డ్రైవర్ టైర్స్ చెక్ చేస్తే ఒక టైరుకు పంక్చర్ అయిందని తెలిసింది. ఆ టైరు మార్చుకోవడానికి అరగంట ఆగాల్సివచ్చింది. పంక్చర్ వేయించుకుని బయలుదేరాము. మళ్ళీ కొద్ది దూరం వెళ్ళాక మరొక టైరు పంక్చర్ అయింది. నాకు కొంత చిరాకు కలిగింది. గురువుగారు, నాతో చిరాకు పడవద్దని చెప్పారు. అక్కడ మళ్ళీ పంక్చర్ వేయించుకుని బయలుదేరాము. మళ్ళీ పూనాకు ఫోన్ చేయాలనే ఆలోచన వచ్చింది. ఎందుకంటే ఎవర్కైనా ఫోన్ చేసి ఫ్లైట్ టికెట్స్ క్యాన్సిల్ చేయమని చెప్పాలనిపించింది. కాని గురువుగారి ముందు నేనేమి మాట్లాడలేకపోయాను. గురువుగారు హాయిగా నిద్రపోయారు. దాదాపు 1:30 గం॥లకు గురువుగారు లేచి ఇంకా ఎయిర్పోర్ట్ ఎంత దూరమున్నదని, ఇంకా ఎంత టైమ్ పడుతుందని అడిగారు. ట్రాఫిక్ లో కనీసం 40 ని॥లు పడుతుందని చెప్పాము. 2 గం॥లకు ఫ్లైట్ అన్నారు కదా! ఫ్లైట్ దొరుకుతుందా అని అడిగారు 'అంతా మీ దయ సార్' అని అన్నాను. సమయం 2:30 గం॥లయింది. ఎయిర్పోర్ట్ దరిదాపుల్లో లేదు. విచారిస్తే దారి తప్పామని తెలిసింది. చివరకు ఎయిర్పోర్ట్ చేరేసరికి మూడుగంటలయింది. అసలు ఎయిర్పోర్ట్కు వెళ్ళి ఏం లాభం లేదనుకున్నాను.



గురువుగారు ఎయిర్పోర్ట్లో అడుగుపెట్టడం. అప్పుడే ఒక ఫ్లైట్ ల్యాండ్ కావడం జరిగింది. విచారిస్తే బెంగుళూర్ వెళ్ళే ఫ్లైట్ ఇప్పుడే ల్యాండ్ అయిన ఫ్లైట్ అని తెలిసింది. నా ఆశ్చర్యానికి అంతులేదు. మా చెకింగ్ అయిన తరువాత దాదాపు 40 ని॥లకు ఫ్లైట్ బయలుదేరింది. ఎయిర్పోర్ట్ లోనివారు 'ఏమండీ, ఫ్లైట్ లేటవుతుందని మీకు ముందే తెలుసా? ' అన్నారు. మేము గురువుగారి వెంట వచ్చామని చెప్పాను. మహనీయులకు అడుగడుగునా ప్రకృతి తోడ్పడుతుందని చెప్పడానికి ఇది మరొక ఉదాహరణ.

## ప్రచండ ప్రకృతి సైతం మహాత్ముని అనుజ్ఞకోసం ...

ఎస్వీయల్ గారు, నేను, ఇవాన్, కార్లోస్, జాక్, వీరా మరికొంతమంది గురుబంధువులు నేపాల్, భైరవ, కపిలవస్తు, కుర్షినగర్, కబీర్ సమాధి చూసుకొని గోరఖ్ పూర్ వచ్చాము. అక్కడినుండి వారణాసి ట్రైయిన్లో సెకండ్ ఎసిలో టికెట్స్ తిసుకున్నాము. ట్రయిన్ రాత్రి 7:45 గంటలకు బయలుదేరుతుంది. మేము గురువుగారి వద్ద ఊది తీసుకొని, లగేజ్ లోడ్ చేసాము. దాదాపు 30, 40 సూట్కేసులున్నాయి. మేము స్టేషన్కి వెళ్ళి అప్పటికే చాలా సమయం గడిచిపోయింది. ట్రైయిన్ టైమ్ అయిపోయింది. గార్డు దగ్గరకు వెళ్ళి రిక్వెస్ట్ చేసాము. కొద్దిసేపు వెయిట్ చేసాడు. అయినా గురువుగారింకా రాలేదు. మాకేమి తోచడంలేదు. గార్డు పచ్చజండా వూపాడు. ట్రయిన్ కదిలింది. అప్పుడు గురువుగారు 300 గజాల దూరం నుండి వస్తున్నారు. మరుక్షణంలో కరెంట్ పోయింది. ట్రయిన్ ఆగిపోయింది. గురువుగారు నెమ్మదిగా వచ్చి ట్రైయిన్ ఎక్కారు. అందరము ట్రయిన్ ఎక్కి కూర్చున్నాము. అప్పుడు కరెంటు వచ్చింది. ఈ సంఘటన 1996 ఏప్రిల్/మేలో గోరఖ్ పూర్ లో జరిగింది. ప్రకృతి యోగుల ఆధీనంలో ఉంటుంది. వారి ఆజ్ఞ లేకుండా ఏదీ జరగదని ఈ సంఘటన తెలియజేస్తున్నది.

## సద్గురు శిక్షణావిధానం ... చెప్పకుండానే అన్నీ నేర్పుతూ ...

నాకు పాన్(కిళ్ళీ) తినే అలవాటుండేది. ఆ పిచ్చి ఎంతగా ముదిరిందంటే నేను మద్రాసులో ఉన్నా, బొంబాయిలో ఉన్నా హైదరాబాద్ నుండి ఫ్లైట్‌లో వచ్చేవారితో పాన్ తెప్పించుకునే వాణ్ణి. ఒకసారి గురువుగారు, 'శివశంకర్ గారు మీరు శిరిడీలో నావద్ద ఉన్నప్పుడు మాత్రమే పాన్ తినాలన్నారు'. దానితో పాన్ తినవచ్చునని శిరిడీ వెళ్ళేవాడిని. ఒకనాడు గురువుగారికి చెవిపోటు, జ్వరం వచ్చిందన్న విషయం తెలుసుకొని శిరిడి వెళ్ళాను. నేను ప్రసాదాలయములో భోజనం చేసి పాన్ వేసుకొని ఆశ్రమానికి వెళ్ళాను. అప్పుడే గురువుగారు దర్శనానికి పిలిచారు. గురువుగారు నన్ను చూసి 'ఏమండీ పాన్ ఇంకా మానలేదా? ' అన్నారు. ఆయన అంత నొప్పి పెట్టుకొని నా గురించి ఆలోచిస్తున్నారని నాకు చాలా బాధ కలిగింది. కళ్ళలో నుండి నీళ్ళు వచ్చాయి. ఆ రోజు ద్వారకామాయికి కూడ వెళ్ళలేదు. తిరుగుప్రయాణంలో బస్సులో ఏడుస్తూనే ఉన్నాను. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. హైదరాబాద్ వచ్చేటప్పటికి నిద్రలేచాను. ఏదో నోటినుంచి వెళ్ళిపోయిందనిపించింది. ఆరోజునుండి పాన్ నోట్లో వేయలేదు. ఆవిధంగా మనం మనకు తెలియకుండానే ఆయన శిక్షణలో ఉన్నాము. మనకు నేర్పుతున్నామని చెప్పకుండానే, అన్నీ నేర్పుతూ ఉంటారు.

పి. శివశంకర్, హైదరాబాద్

## కృషి రవ్వంత - కృప కొండంత

నాపేరు రామకృష్ణ. మా అమ్మ, అక్కయ్య తెనాలిలో క్రిష్ణా మాస్టారుగారి సత్సంగమునకు ప్రతి ఆదివారం వెళతారు. నేను అప్పుడప్పుడూ వెళ్ళేవాడిని. అయితే నేను చదివేది ఐ.టి.ఐ. తరువాత నేను కరస్పాండెన్స్‌గా డిగ్రీ చేసినాను. అయితే నేను ఎందులోనూ, ఏ ఊరిలోనూ నిలకడగా ఉండలేకపోయాను. అయితే నేను గురువుగారిని నమ్ముకున్నాను. నా గురించి మా అమ్మ, నాన్నగారు దిగులు చెందేవారు, నేను ఏ ఉద్యోగం చేయడం లేదని, గురువుగారు షిరిడీ వచ్చారని తెలిసి నేను 2002 మే లో గురుబంధువులతో షిరిడీ వచ్చాను. అయితే షిర్డి లో రెండురోజులు ఉన్నాము. గురువుగారు పాదదర్శనం ఇచ్చినారు. అప్పుడు నేను గురువుగారికి నా బాధలను విన్నవించుకున్నాను. నేను చెప్పినదేమిటంటే 'అయ్యా! నేను అంత పెద్ద చదువులు చదవలేదు, ఎక్కడా నిలకడగాలేను. చదువులోనూ మరేవిషయంలోనూ నిలకడలేని నాగురించి ఇంట్లోవాళ్ళు దిగులు చెందుతున్నారు. నాకు ఒక మార్గము చూపించండి అని. వ్యాపారము చేసుకోమంటారా? ఉద్యోగం చేసుకోమంటారా? ' అని అడిగితే గురువుగారు కొన్ని నిమిషములు ఆగి ఉద్యోగం చేసుకోమని నన్ను దీవించారు.

ఆ తరువాత మేము మా వూరికి వెళ్ళిపోయాము. నేను ప్రస్తుతం మా బావగారి షాపులో ఉంటున్నాను. జూలైలో నేను బాబా చరిత్ర పారాయణ మొదలు పెట్టాను. రెండుసార్లు అయిపోయినది. మూడవసారి మొదలు పెట్టినాను. ఆ వారమే గురుపౌర్ణమి వచ్చినది. గురుపౌర్ణమి అయిపోయిన తరువాత మూడు రోజులకు 'ఈనాడు' పేపరులో హెరిటేజ్ వారి ఉద్యోగ ప్రకటన పడినది. దానికి అద్దంకిలో ఇంటర్వ్యూ. నేను విజయవాడలో మా బావగారి వద్ద వున్నపుడు మానాన్నగారు ఈ ప్రకటన గూర్చి చెప్పడానికి ఫోన్ చేసినారు. నేను దానికి వచ్చేదా పెట్టేదా. ఈ రోజుల్లో అంతా రికమెండేషన్స్ వల్ల పని అవుతుందే కాని మనలాంటివాళ్ళ వల్ల ఏమి అవుతుంది.

అందులో అది చంద్రబాబునాయుడు గారిది. ఖచ్చితంగా రికమండేషన్స్ ఉండాలి అన్నాను. ఏదైతే అది అవుతుంది, వెళ్ళిరమ్మన్నారు. ఈ ప్రకటన శుక్రవారం పడినది. సోమవారం ఇంటర్వ్యూ అని చెప్పినారు. నేను ఆదివారం తెనాలిలో మా ఇంటికి వెళ్ళి అక్కడ నుండి సోమవారం ఉదయం అద్దంకికి బస్సులో బయలుదేరాను. నాతో పాటు నా స్నేహితుడు కూడా వచ్చినాడు. అయితే గురుపౌర్ణమికి వచ్చిన 'గురుకృప' పుస్తకము తీసుకొని వెళ్ళినాము. దారిపొడవునా గురుకృప చదువుతూ వెళ్ళాము. అయితే అద్దంకి వెళ్ళిన తరువాత మేము 'హెరిటేజ్' ఆఫీసుకు వెళ్ళి విచారించినాము. మూడు వందల మంది దాకా వచ్చినారు, అనితెలిసింది. అపుడు నా స్నేహితుడు ఇంతమందిలో మనకి వస్తుందా అని, వెళ్ళిపోదాము అన్నాడు.

నేను ఇంత దూరం వచ్చినాము కదా ఇంటర్వ్యూకి వెళ్ళకుండా మనశ్శాంతిగా ఉండదు అని ఆపినాను. 'హెరిటేజ్'లోని వైస్ ప్రెసిడెంట్‌తో ముఖపరిచయం ఉంది. ఆయన చేత చెప్పిస్తే పని అయిపోతుంది. ఆయన తిరుపతిలో ఉంటారు అని నేను చెప్పినప్పుడు, నా స్నేహితుడు అయితే ఆయన చేత చెప్పియ్యచ్చుగా అని అన్నాడు. నేను అది చాలా లాంగ్ ప్రొసెస్. అయినా ఎక్కడున్నారో ఎంత బిజీగా ఉన్నారో ఆయన, మనల్ని పట్టించుకొనే టైం ఉంటుందా అని, ముందు ఇంటర్వ్యూకి వెళ్ళిన తరువాత చెప్పించుకుందాములే అని అన్నాను. ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఇంటర్వ్యూలు చేసేవారు హైదారాబాద్ నుండి వచ్చినారు. 4:00 కల్లా ఇంటర్వ్యూలు పూర్తిచేస్తామన్నారు. సాయంత్రం 3:45కి ఇంకా 100 మందిని ఇంటర్వ్యూ చేయాల్సి ఉంది. అయితే ఇంటర్వ్యూ చేసేవారిలో ఒకరు ప్రక్కరూములోకి వెళ్ళివచ్చినారు. ఆ తరువాత నుంచి ప్రక్కరూములో ఇంటర్వ్యూలు చేయడం మొదలు పెట్టారు. నాది మూడవ నెంబరు తరువాత నా స్నేహితుడిది. మా నెంబర్లు వచ్చినవి. అయితే ఈ రెండు రూముల మధ్య కూర్చున్న అటెండరు నన్ను నీవు ఈ రూముకి వెళ్ళు నీ పని అయిపోతుంది అని, మా స్నేహితుడుని నీవు హైదరాబాదు వాళ్ళుచేసే రూములోనికి వెళ్ళమన్నాడు. నేను ప్రక్కరూములోనికి వెళ్ళినాను. ఆ రూములో ఇంటర్వ్యూ మొదలు పెట్టిన వ్యక్తి 'హెరిటేజ్' వైస్ ప్రెసిడెంట్ అని నాకు అప్పుడే తెలిసినది. నన్ను గుర్తుపట్టి ఎటువంటి ఇంటర్వ్యూ చేయకుండా, ఒకగంట బయటకూర్చో రిజల్ట్స్ చెబుతాము అన్నారు. ఒక గంట తరువాత వచ్చిన 300 మందిలో 9 మంది పేర్లను ప్రకటించినారు. వీరిలో నేను వుండటము చూసి నా కళ్ళు నీరు కారినవి. ఆ అటెండరు అటుకాక ఇటు అంటే నాకు ఉద్యోగం వచ్చేదికాదు. నా స్నేహితుడికి రాలేదు. సెలక్ట్ అయిన వారిలో 6 గురికి మంత్రుల రికమండేషన్స్ ఉన్నాయి. నాకు మాత్రం మా గురువుగారి 'అనుగ్రహ'మనే దివ్యమయిన రికమండేషన్‌తో ఉద్యోగం ఇప్పించినారు. నాకు గురువుగారు షిర్డీలో ఉన్నారని తెలిసి షిరిడీకి అప్పటికప్పుడు వెళ్ళి గురువుగారి దర్శనము చేసుకొని ఉద్యోగం వచ్చినదని చెప్పుకున్నాను.

ఐ. రామకృష్ణ, తెనాలి

*అనుగ్రహానికి అందరూ అర్హులే !*
*ఆనందం మన జన్మహక్కు*

*ముముక్షత్వ దశలో బోధించవలసిన వివేకవైరాగ్యాలను, వేదాంత సత్యాలను ఇంకా ఆర్తులుగా అర్థార్థులుగా ఉన్న దశలో మనకు బోధిస్తే - అది శుష్కవేదాంతమవుతుంది. అటువంటి శుష్కవేదాంతానికి శ్రీ సాయిపథంలో చోటులేదు*
*సాయిభక్తి సాధన రహస్యం. పు. 15*

# ఏంటి డాడీ! గురువుగారికి తెలియదా?

'ఇలలోనైనా, కలలోనైనా గురుమహిమను శంకించకు' అన్న దానికి ప్రత్యక్షముగా గురుసన్నిధిలో జరిగిన సర్వజ్ఞతను తెలిపే అద్భుత లీలా కథనం.

మా అబ్బాయి సతీష్ కుమార్ తన పుట్టినరోజు అక్టోబర్ 26వ తేదీన గురూజీ ఆశీర్వచనముకై $2^{1/2}$ సం॥ తరువాత షిరిడీకి వచ్చి ఆరోజున ఊరికి వెళ్ళే వారితో గురువుగారు యిచ్చే దిదర్శనమునకు అందరితో వెళ్ళినాడు. దర్శనానికి వెళ్ళి పాదనమస్కారములు చేసుకొని తన పుట్టినరోజు గురించి, వ్యాపార విషయముల గురించి వారి ఆశీర్వచనము పొంది, ఊది, ప్రసాదములతో రావడము, అతని ప్రయాణము ఒక రోజుకి వాయిదా పడడం జరిగింది.

ఆరోజు రాత్రి మేము ముగ్గురుమూ నందదీపం వద్ద కుటుంబ విషయములు మాట్లాడుకోవడం, రేపు మరల దర్శనానికి వెళ్ళినపుడు, ఇంకోసారి విపులముగా వ్యాపార అభివృద్ధి గురించి గురువుగారిని అడుగు అని నేను సలహా ఇవ్వడం జరిగింది. మరుసటిరోజు సాయంత్రం ఊరికి వెళ్ళేవారితో దర్శనానికి వెళ్ళి ప్రసాదంతో బైటికి వచ్చినాడు. వెంటనే నేను గురువుగారితో ఏమి మాట్లాడినావు అని అడిగాను. తను నమస్కారము చేసుకొని వచ్చినాను, ఇంకా ఏమి చెప్పలేదు అని సమాధానం ఇచ్చినాడు. వెంటనే నేను నీవు చాలా సంవత్సరాల తరువాత వచ్చినావు కదా! కనీసం రత్తయ్య వాళ్ళ అబ్బాయిని అని ఐనా చెప్పినావా అని నిష్టూరముగా అడిగినాను. సతీష్ చిరుకోపంతో 'ఏంటి డాడీ గురువుగారికి తెలియదా? ' అని ప్రశ్నించి తిరుగు ప్రయాణానికి జీపు ఎక్కినాడు. మరల 28వ తేదీన నేను, దుర్గ (మా ఆవిడ) గురువుగారి దర్శనానికి వెళ్ళినాము. సర్వజ్ఞతకు మచ్చుతునకలు బాబా లీలలలో అనేకం. మనందరం విశ్వసించే ఆ బాబానే ఈ బాబూజీ అనే దానికి ప్రత్యక్ష లీలలు ఎన్నో.. ఎన్నెన్నో...

మేము లోపలికి ప్రవేశించి నమస్కారములతో వెళ్ళగానే ముందు పలకరింపుగా దుర్గను చూస్తు 'అబ్బాయి ఊరికి వెళ్ళాడా' అని గురువుగారు అడిగారు.

*ఒకరికి పరామర్శ... ఒకరికి సటకా .....*

*ఆ రోజులలో బండ్లకొద్ది ఊది, నేను పొందగలిగినంత అనుగ్రహం.*

జి. రత్తయ్య, తెనాలి.


*సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...*
*శరద్బాబూజీ వంటి గురువు అరుదోయి... అరుదోయి...*

# గోల్ చేయించినది గురువే.. మా గోల్ తానై నడిపిస్తున్నది శరద్గురువే!

గురుకృపకు కృతజ్ఞతలతో...

నాపేరు వినయ్, నేను 8వ తరగతి చదువుతున్నాను. నా అనుభవాల్లో ఒక దాన్ని మీకు చెప్తాను. నేను స్కేటింగ్ లో హాకీ ఆటగాడ్ని. మా టీముకు నేను పాల్గొంటున్న మొదటి రాష్ట్రస్థాయి పోటీల్లో నన్ను కెప్టన్‌గా ఎంపికచేసారు. జాతీయస్థాయి (స్కూల్ లెవల్) టీముకు కూడా నన్ను కెప్టన్‌గా ఎంపిక చేసారు. మూడవ రాష్ట్రస్థాయి స్కేటింగ్ హాకీ పోటీలు విశాఖపట్టణంలో జరిగాయి. ఈ పోటీల్లో మొదటి మూడు మ్యాచ్‌లు గెలిచాము. కానీ నాల్గవ మ్యాచ్‌లో మేము ఆడవలసిన నిజామాబాద్ టీమ్ చాలా అనుభవం ఉన్న టీమ్ కావడంతో మా గెలుపు సందిగ్ధంలో పడింది.

మ్యాచ్ ఆరంభమయితే 10ని॥ల ఆట, 5ని॥ విరామం, మరల తిరిగి 10 ని॥ ఆట జరుగుతుంది. ఆట ఆరంభమయిన మొదటి 10 ని॥లలో నిజామాబాద్ టీమ్ 2 గోల్స్ చేసింది. ఈ సమయానికి మేము గోల్స్ ఏమి చేయలేకపోయాము. ఉన్న పరిస్థితులలో మ్యాచ్ మాచేయి జారిపోయిందని భావించాము. మాకున్న 5 ని॥ల విరామ సమయంలో మానాన్నగారు వచ్చి ఓటమిని గురించి ఆలోచించకుండా విషయాన్ని బాబాకు, గురువుగారికి వదిలి కళ్ళుమూసుకొని 2 ని॥ బాబాను, గురువుగారిని స్మరించుకుంటూ కూర్చోమన్నారు.



విరామం తరువాత జరిగిన ఆటలో మా ప్రత్యర్ధి టీమ్‌లోని ఒకరు పౌల్ చేయడంవల్ల, నాకు బంతిని చాలా దూరం నుంచి గోల్ చేసే అవకాశం వచ్చింది. అది గోల్ అవుతుందన్న నమ్మకంలేదు. కానీ నేను కొట్టిన బాల్ ప్రత్యర్ధి జట్టులోని ఒకతనికి తగిలి గోల్ అయ్యింది. ఇది నిజంగా అద్భుతం. కేవలం గురుదేవుల అనుగ్రహం యొక్క ఫలితం తప్ప మరేమీకాదు.

ఇక నా జట్టు సభ్యులు 'నువ్వు చెయ్యగలవు వినయ్' అంటూ ప్రోత్సాహమిచ్చి, ఇంకొక గోల్ చేస్తే మ్యాచ్ 'డ్రా' అవుతుందని గుర్తుచేసారు. 'గురుకృప' తో మరల నేనే రెండు గోల్స్ చాలా దూరం నుంచి చేసాను. ఇదే సమయంలో మా ప్రత్యర్ధి జట్టు 2 గోల్స్ చేయడంతో స్కోరు 4:3 గా ఉంది.

ఇంకా అయిదు సెకన్లు ఉండనగా నేను మరో గోల్ చేసి స్కోరును 4:4 గా చేసాను. నేను ఇలా మరో గోల్ చేయడం నన్ను నేను నమ్మలేకపోయాను. ఆట డ్రాగా తేలడంతో 'ఎంపైర్' ఇరుజట్లకు 5 పెనాల్టీ షాట్స్ చేసే అవకాశమిచ్చారు. ఇరుజట్లలోనూ, నేను ఒక్కడినే ఒకే ఒక్క గోల్ చేయడంతో మేము 5:4 స్కోర్‌తో విజయం సాధించాము.

మీకొక విషయం తెలుసా, ఈ విజయం సాధిచడానికి గోల్స్ చేసింది నేననుకుంటారేమో, కేవలం బాబూజీనే అన్న నా ఆత్మ విశ్వాసాన్ని తెలియజేసుకుంటున్నాను మీ అందరికీ.

వినయ్, స్టీల్ సిటీ, వైజాగ్

# ఆ చేయి ఎంత హాయి



*'మానవత్వం - నిర్భీతితత్త్వం*
*మూర్తీభవించే - మహితతత్త్వం'*

'కబీర్ సాహెబ్‌కీ పరిచయ్' అను ఉద్గ్రంధాన్ని శ్రీ అనంతదాస్ అనే సాధువు 1645 ప్రాంతమందు రచించినట్లుగా కబీర్ చరిత్ర వ్రాసిన చరిత్రకారులు తెలిపినారు. ప్రతిరచనలోను కొన్ని వ్యత్యాసములు దొర్లినవి. కొన్ని పంక్తులు, పదాలు ఇతరులెవరో వ్రాసి కబీరు పేరుతో ఆపాదించి ప్రచారం చేసినట్లుగా కన్పిస్తున్నాయి. వాస్తవమో అవాస్తమో చెప్పలేము గాని నమోదై వ్రాయబడిన వాటిని గమనించక తప్పదు.

ఏవిధమైన ఆహారాన్ని స్వీకరించకుండానే కబీరు పెద్దవాడైనాడని కొందరు, చాలా సంవత్సరాల కాలం గతించిన తరువాత తల్లిదండ్రుల బలవంతం మీద పాలు త్రాగటానికి ఒప్పుకొన్నాడని కొందరు వ్రాసారు. మరొకదానిలో పసితనములో పాత్రను పట్టుకొని దూడలేని ఆవువద్దకు వెళ్ళిన వెంటనే కబీరులోని మనో సంకల్పము నెరిగి పాత్ర నిండువరకు చేపుకొనేదనే కథ కొంత ప్రచారంలో ఉంది.

కబీరును చూచిన వారంతా అతని దినచర్యలు, వేషము, మాట్లాడే ధోరణిని ఆధారం చేసుకొని, తప్పక ఇతడు మతవిరోధి అవుతాడు అనే వారు, ఎందుకంటే పెరిగిన వాతావరణమేమో ఇస్లాం మతాన్ని అభిమానించే సాలెకుటుంబము. అతని ఉచ్ఛారణలో హిందూ దేవతలుంటారు. బాహ్యమైన వేషము వైష్ణవ మతానుకూలంగా ఉంటుంది. ఇరు మతస్తులు అతనిని ఏవగించుకున్నారు. కబీరు పలికిన రాముడు, హిందువుల ఆరాధ్యదైవమైన అయోధ్యారాముడు కాడు. అందువలన ఆరోజులలో హిందువులనుండి ప్రతిఘటనా తప్పలేదు. రామనామోచ్ఛారణ మన్నది హిందూమతానిదేనని ముస్లిం సోదరుల తిరుగుబాటు. ఇలాంటి విజృంభణలను నిర్భీతులై త్రిప్పికొట్టాడు కబీర్. కబీరు మాటలను ఆలకించితే నిర్మోహమాటము, భయమెరుగని మనస్తత్వము, సత్యముపై ప్రేమ, వాస్తవాన్ని విశదపర్చు విషయంలో కర్కశత్వములన్నవి మహాత్ములయొక్క లక్షణమని ఊహించవచ్చు.

(గురువుగారిలో కర్కశత్వమును గమనించలేదుగానీ, సౌమ్యమైన రీతిలో ప్రేమగా, లాలనగా నవ్వుతూ చెప్పడమన్నది నేను గమనించాను.)

దైవభక్తే తన శక్తిగా మలిచి, న్యాయము, ధర్మము, సత్యమనే వాటినే ఆయుధములుగా మలచి, భగవంతుని రక్షాకవచంగా ధరించి ఇలా అన్నాడు. మాయోపాయంతో వంచనతో, కపటంతో, ఢాంబికమైన భక్తిని ప్రదర్శిస్తూ ఇతరుల బలహీనతలను గ్రహించి అమాయక ప్రజలను వంచించి ఇతరుల ధనమును, భజనల పేరిట, పూజా పురస్కారాల పేరిట, ఆడంబరము, అతి ఆకర్షణలయిన అలంకారముల పేరిట రకరకాల మిషలతో, దైవం పేరుతో దోచుకునే వారే, మత విరోధులని, గురుద్రోహులని సమాధానమిచ్చాడు. ఈ భావాలనే ఆయన దోహాదాలందు వ్రాసాడు. ఈ దోహాదాలను గురుచరణ దాసుడనేవారు తెలుగు సేత చేసియున్నారు. (మచ్చునకు)

**'ఆచరించలేని సూక్తులను అతిగా వల్లించకు'**


**'అతి అనిపించు భక్తి ప్రపత్తులను ప్రకటించకు'**

కొన్నివందల సంవత్సరాల కాలము క్రితము చెప్పిన ఈ సూక్తులు ఈనాటి సమాజంలో సజీవ జీవరాసులు. మనము నిత్యము గమనించుతూనే ఉంటాము. కొన్ని ఆదర్శ కేంద్రాలలో గోడలమీది నీతి వ్రాతలు, బ్యానర్లపై సూక్తులు కొత్తవారిని ఆకర్షిస్తాయి. కథ తెలిసిన పాతవ్యక్తిని చూసేసరికి తలలు వంచుకుంటాయి. ఎంతో సాహసం ఎంతో ధైర్యంతో మరో సందర్భములో

**ఉపవాసముండును - మాంసము తినును**

**తపము చేయును - శాపములిచ్చును**

ఉపవాసముండేదెందుకు, తపస్సుచేసేదెందుకు? సూటిగా ప్రశ్నించాడు. వ్రతాలపేరుతో మాసాలపేరుతో ఉపవాసముండి సుష్టుగా భోజనము చేయడమా? త్రిగుణాలను గమనించి ఏఏ పదార్థములను భుజించిన సత్వ, రజస్తమోగుణాలు మనలో చోటు చేసుకుంటాయో తెలిసికూడా మితిమీరిన ఆహారాన్ని అందుకుంటున్నాము, దీర్ఘకాలము అత్యధిక శ్రమకోర్చి తపమాచరించిన సాధువర్తనలు శాపము పెట్టుచున్నారే! కోపమును జయించుటే తపము యొక్క పరమావధియని వ్యాసునికి పార్వతి చెప్పియున్నది. (కాశీ ఖండము) సాటి వారిని ప్రేమించు, సర్వులను సములుగా చూడమని అంటారు. ఎవరి మనసులను వారే సాక్షి అని అంటూ మరో సందర్భంలో కబీరు సాహెబ్



**'వందలాది మంద మతులను వెంటేసుకోకు**

**కొందరైన యోగ్యులున్న వారిని వదులుకోకు'**

బహుశః వాపును చూసి బలుపనుకొనే వారిని ఉద్దేశించి ఈ మాట అనుంటారు. ఎంత ఎక్కువమంది ఉంటే అంత గొప్పని భావించిన వారిని చూచి సూటిగా ఇలా అంటారు.

**'ఊరకుక్కలు పదివేలు ఏల వేటకై ఒక్క జాగిలంబు చాలదా? '**

లోతైన మహాత్ముల అంతర్యాలు, మాటలు, చేష్టలు, సామాన్యునికవి అర్థం కాకపోయినా, వారి తెలివి తక్కువ తనానికి చింతించక అపార్థంచేసుకొని బురదజల్లే ప్రయత్నం చేస్తారు. నిర్భీతుడుగా, నిర్మొహమాటంగా తన, మన, అనే వ్యత్యాసాలు లేకుండా వ్యవస్థలోని, వ్యక్తిలోని, లోపాలను తూర్పార పట్టాడు. సాధకుని లక్షణమిదేమో, ఆలోచించాలి. సూటిగా తూర్పారపట్టి అనేసాడు ఒక సందర్భములో


**'సత్యదర్శనమే దైవదర్శనం**

**దైవ భక్తికన్నా నైతిక విలువే మిన్న**

**అన్నా ఇది తెలియకున్న దైవమేసున్నా'**

నైతిక విలువలకు మహాత్ములంతా ఎంతో ప్రాముఖ్యమిచ్చారు. గురుదేవులు గూడా నైతిక విలువలను గుర్తించమంటారు. అది మన మానవ జీవన సరళికి ముఖ్యమని హితోక్తిగా చెప్పారు. ఒళ్ళంతా భగవన్నామమనే సెంటు పూసుకొని అవినీతియనే బురదలో మునిగితే ఎలా ఉంటుందో ఊహించుకోండి. లక్షలాది మంది నోళ్ళుకొట్టి వందమందికి అన్నదానం చేస్తే పుణ్యమా? ఫలితమా? అది ఎవరికి చెందుతుందో యోచించండి. నైతిక విలువలయొక్క అవసరమెంతుందో, అది ఆధ్యాత్మికతకు ఎంతగా ముడిపడి ఉంటుందో గ్రహించాలి. మహాత్ములంతా ఈ విషయాన్ని సందర్భానుగుణంగా ప్రవచించారు.

కబీరుసాహేబ్‌లో ప్రశంసింపదగిన వివేకముంది, సంయమనముంది. తన మాటలద్వారా, చేతలద్వారా సాధారణ మానవుని విద్యావంతునిగానో, జ్ఞానవంతునిగానో, వివేకమంతునిగానో ఆలోచింపదగినదిగానో ఉంటాయి. ఒక అనుభూతిని కలిగించే సన్నివేశాన్ని గమనించుదాము. చచ్చిపోయిన పితృదేవతలకు చతుష్టాతా కార్యక్రమం జరుగుతున్నది. ఆవు పాలు తెచ్చిమ్మని కబీరును పురమాయించారు. కబీరు ఎంత సేపటికి రాకపోయేసరికి కబీరును చూచిరమ్మని తన మనుష్యులను పంపాడు. వారు తిరిగి వచ్చి చచ్చిన ఆవుకు మేత వేసి పొదుగు వద్ద గిన్నె ఉంచారు అని చెప్పారు. ఈ చర్యకు అర్థం ఏమిటని అడుగగా చనిపోయిన వారికి చనిపోయిన ఆవుపాలే శ్రేష్టమని చెప్పాడు. చనిపోయిన ఆవు ఎక్కడైనా మేతతింటుందా? , పాలిస్తుందా? అని గర్జించినందుకు, క్షణం క్రితమే మరణించిన ఆవు మేత తినలేనప్పుడు ఎన్నడో గతించిన వారికి ఈ ఆవు పాలను ఎలా సమర్పించగలరని పలికి పాత్రను వదిలేసి వెళ్ళిపోయాడు.



ఇది నిజం కావచ్చు, అబద్ధం కావచ్చు, కల్పితము కావచ్చు ఇందులో 'యోచన - ఆలోచన' దాగి ఉన్నదన్నది సత్యము. అర్థంలేని సంప్రదాయాన్ని వ్యతిరేక భావనలను కబీరు నిర్మొహమాటంగా గర్హించేవాడని తెలియుచున్నది.

భగవన్నిర్ణయాన్ని తర్కబలంతో నిరూపించాలనుకొనే వారిని కబీరు వదలలేదు. అలాంటివారి వాదనలు విని భగవంతునికి రూపమెటువంటిది, రంగు ఎటువంటిది, ఆకారమెటువంటిది. ఆయన ఎక్కడ నివసిస్తాడు. ఆయన ఉండే నిక్కచ్చితమైన చోటేమిటి? అని అడిగేవాడు. భగవంతుడి రంగు రూపు ఉనికి ఇదియని స్పష్టముగా చెప్పలేమని తార్కికులనేసరికి మీరెలా భగవన్నిర్ణయము చేయగలుగుతారు. ఆయన తర్కానికి అందడు, వర్ణనలో ఆయన రూపం ఇముడుతుందా? ఆయన ద్వైతమనిగానీ, అద్వైతమనిగానే చెప్పలేదే. వారివారి ఉపకరణాల ద్వారా ఆయనను చేరగలుగుతారే తప్ప మీ వాద బలాల అనుగుణంగా సాధ్యమా? ఆయన ప్రేమకు-బానిస, సేవకు-దాసుడు రక్షించేరూపమేదైనా కావచ్చు. ఆదుకునే రూపానికి ఏ రంగైనా ఉండవచ్చు. పోషించే స్వభావమున్న మహనీయుడు ఇక్కడ ఉంటాడని ఎలా చెప్పగలము. అంతటా, అందరిలోను సర్వవ్యాపకమై ఉంటాడు. ఆయనే భగవంతుడు. మరికొన్ని విశేషాలు రాబోవు సంచికలో చూడగలుగుతాము.

(సశేషం)


*సమర్పణ: డా॥ ఎన్. సాయి వర ప్రసాదరావు, రీడరు, రేపల్లె.*

# మహనీయుల - మహితోక్తులు

సమర్పణ: గురుచరణదాసుడు

గురువుగారిని ఎందరో సందర్శించి కొన్ని సమయాల్లో కొందరు బాబా అనుగ్రహం పొందాలంటే ఎలా? బాబాను ప్రేమించేదెలా? బాబాకు నివేదనను భక్తితో సమర్పించేదెలా? అని అడిగేవారు. 'బాబా' విషయమైతే ఆయన హృదయం ఆనంద పారవశ్యం . ఎంతో ప్రేమగా మాధుర్యంగా వారివారి సందేహాలను సముచిత రీతిన వారిని సమాధాన పర్చేవారు. వారు చెప్పిన సమాధానం విన్న తరువాత గురువుగారిని చూస్తే నాకెందుకో ఆయనలో ప్రహ్లాదుడు కనిపించాడు. భాగవతంలో ప్రహ్లాదోపాఖ్యానం చదువుతుంటే ప్రతిభావంలోనూ గురువుగారు దర్శనమిచ్చారు. చివరికి భాగవతోత్తములంతా ఇంతేననిపించింది. పసితనంలో ప్రహ్లాదుడు.

'పానీయంబులు డ్రావుచున్, గుడుచుచున్, భాషింపుచున్, హాసలీ
లానిద్రాదులు సేయుచున్, దిరుగుచున్, లక్షింపుచున్, సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతస్వాదనం
ధానుండైమరచెన్ సురారిసుతుడేతద్విశ్వమున్ భూవరా!'



ఆహారము స్వీకరించునపుడు, పానీయాదులు త్రాగునపుడు, ఇతరులతో సంభాషించునపుడు, నిద్రపోవు సమయాన, చేయు ప్రతి పనియందును నిరంతరము తన ఆరాధనా దైవమనే హృదయమునందు నిలుపుకొనిన వానికే ఇతరములవైపుకు మనసు పోదు. అట్టి స్థితిలో తనను తాను మరిచిపోవును. ఈ విశ్వమును మరిచిపోయి ఒకే దైవముపై మనసు లగ్నమగుటయే ప్రేమ అని నిరూపించాడు ప్రహ్లాదుడు.

ప్రేమ ఎలా అంకురించునో తన సహజధోరణిలో

ఇనుమయస్కాంత సన్నిధి నెట్లు బ్రాంత
మగు, హృషీకేశు సన్నిధి నా విధమున
గరగుచున్నది, దైవయోగమును జేసి .... భాగవతం - సప్తమ
-దివ్య పాదారవింద
చింతనామృతపాన విశేషమత్త
చిత్తమేరీతి నిరతంబు జేరనేర్చు - భాగవతం - సప్తమ

నిరంతరము తన ఆరాధ్యదైవము పట్ల చింతనా శక్తి గల ప్రహ్లాదునికి 'ఇనుమును-అయస్కాంతము' ఆకర్షించునట్టి సహజమైనరీతిగా దైవయోగమున కుదిరినది. అందువలననే ఇతరము లాతనని ఆకర్షింపలేక పోయినవి. ప్రేమ సహజంగా అంకురించేందుకు ఇతరమైన వాటికి చోటు లేకుండా ఉండే వారికి ఇది సాధ్యపడుతుంది.

ఉదా॥ గురువుగారిని గమనించగలరు. వారు కాఫీ త్రాగబోయే ముందు, భోజనానికి ముందు, బాబాకు నమస్కరిస్తారు. వారి పాదాలకెవ్వరైన నమస్కరించినపుడు చేతిలో ది ఉంటుంది, వారి నమస్కారాన్ని బాబాకు సమర్పించుతున్నారు. వారి ప్రతి మాటలోనూ, చర్యలోనూ, ప్రతివిషయములోనూ బాబానే చూస్తారు. బాబాకే సమర్పించుతారు. 'సాయి సే-సాయి ధ్యాసే లేదు లేదిక వేరేబాట' అంటే పై భావనే. గురువుగారి హృదయంలో నిండి ఉన్నరూపం, వారి ప్రతిశ్వాస బాబానే. అందుకే ఆయన 'సాయి సాధనాస్వరూపి'. ప్రేమనేది సహజంగా అలవడే గుణము. ఇతరాలకు తావివ్వనంతవరకు అది అపూర్వంగా ప్రేమరూపంగా నిండుగా ఉంటుంది. ఒక ఒరలో ఒకే కత్తి ఇమడిన రీతిగా ఒక మనసులో ఒకే ఆరాధనా దైవానికి అర్పణ చేయగలగడం ద్వారా ప్రేమకు అంకురార్పణ జరిగేది.

*సాధనకు మన జీవితంలో భాగంగా చేసుకుంటున్నాము*
*కానీ సాధనలో ఈ జీవితం ఒక భాగం కావాలి* ....*బాబూజీ*

*'గురుకృప' పత్రిక జన్మించి అయిదు వసంతాలు గడిచింది. ఈ అయిదు వసంతాల సింహావలోకనంలో గురుబందువుల సహకారం, గురు అంగ్రహంతో నిండుగా, మెండుగా అందింది. 'గురుకృప' పత్రిక స్థాపనా లక్ష్యాన్ని మరొక్కసారి ఎరుకలోని తెచ్చుకొనే ప్రయత్నం.. గురులీలలనే అనుగ్రహంతో లభించిన అనుభవసారాన్ని, మనమందరం పంచుకొని, యోచనతో ఆచరిస్తే గురువుని అన్ని విషయాలకు, ఎల్లప్పుడూ అంటిపెట్టుకొనే విశ్వాస సాఫల్యత మనకు కలుగుతుంది. అలా గురువుకు శరణాగతి చెందడమే మనకు గమ్యం - అదే గురుకృప లక్ష్యం.*

*ఒక్కడుగు తనవైపుకేస్తే, పది అడుగులు తాను వేస్తానని బాబా ఇచ్చిన అభయమనే బాటను, మనకు రాచబాటగా అందించిన గురుపథంలో మనం ఎన్ని అడుగులు వేయగలిగామన్న అవలోకనే ఈ నూతనవత్సర ఆరంభం కావాలని 'గురుకృప' ఆకాంక్ష*

*గురుబంధువులు*



## పరమ పావనమైన

పరమ పావనమైన గురుదేవు పదములు పట్టి భజియింపవే మనసా!
పరతత్వమునుగొని మరల జన్మకు రాని పదములు చేర్చవే మనసా!
పరి పరి గతులను పరుగెత్తుచు నీవు గురుమహిమ మరువకే మనసా!
స్థిరమిదే అనుకోకు పరులను నమ్మకు గురుసేవ విడువకే మనసా!
మరువకు ఎప్పుడు గురుదేవుడొక్కడే పరమ బంధువు డగునె మనసా!
శరణు శరణనుచు స్మరణ మాత్రముననే కరుణ కురిపించును మనసా!
వరము లాసించకుమ సిరిసంపదలు స్థిరమ పరతత్వము కనుము మనసా!
పరమ పావనమైన సద్గురుని చేరి ఆనంద మొందవె మనసా!

